క్లుప్తంగా

కొనసాగుతున్న శ్రీరంగమ్మ పేరంటాలు ఉత్సవాలు

తేలప్రోలు(గన్నవరం): మండలంలోని తేలప్రోలులో వేంచేసియున్న శ్రీరంగమ్మ పేరంటాలు అమ్మవారి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. సాయంత్రం పరిసర గ్రామాల నుంచి ఎడ్ల బండ్లపై ప్రత్యేకంగా అలంకరించిన ప్రభలతో భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు సమర్పించారు. రాత్రి అమ్మవారికి ఊయ్యాల సేవ జరిగింది. మంగళవారం రాత్రి వరకు ఉత్సవాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

మజ్జిగ పంపిణీ

గన్నవరం: స్థానిక గాంధీచౌక్, సినిమా హాల్ సెంటర్‌లోని మానవతా స్వచ్ఛ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాల్లో సోమవారం పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా దాతలు కర్రా వరప్రసాద్, తోట రమేష్, దొడ్డ కుమార్, తంగెళ్లమూడి రవిప్రకాష్ సౌజన్యంతో 400 మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. సంస్థ కార్యదర్శి వరప్రసాద్, సంయుక్త కార్యదర్శి వీసం ప్రసాదరావు, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

ఉంగుటూరు(గన్నవరం): ఉంగుటూరు మండలంలోని లంకపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. తొలుత ఉంగుటూరు ఎస్ఐ యు.గోవింద్ విగ్రహాన్ని ప్రారంభించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ జయంతి రోజునే విగ్రహాన్ని ఆవిష్కరించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఎంపీపీ వడ్లమూడి సరోజిని, సర్పంచి కే సుజాత, విశ్రాంత ఎంపీడీఓ వీపీ విజయకుమార్, పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

పెనమలూరు: పౌష్టికాహారంతోనే ఆరోగ్యంగా ఉంటారని వైఎస్సార్ సీపీ నాయకురాలు, వణుకూరు గ్రామ సర్పంచి చక్క విజయ అన్నారు. వణుకూరు గ్రామంలో సోమవారం పోషణ పక్వాడా పక్షోత్సవాల సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులు, చిన్నారుల కోసం పౌష్టికాహారంతోపాటు, ఆరోగ్యంగా ఉండటానికి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. తల్లి పాలు బిడ్డకు చాలా మంచిదని, దీని ద్వారా బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి వీ పద్మావతి, ఉప సర్పంచి నాగరాజు, వార్డు సభ్యుడు కే శ్రీనివాసరావు, సచివాలయం సిబ్బంది టీ లత, డీ వికల్ప, ఎం.సుధారాణి, డీ సునీత, ఏఎన్‌ఎం రష్మి, జీ అరుణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కూరగాయల దుకాణంలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో సప్తగిరి గ్రామీణ బ్యాంక్ వద్ద సోమవారం ట్రాక్టర్ అదుపు తప్పి కూరగాయల దుకాణంలోకి దూసుకెళ్లింది. మద్యం మత్తులో ట్రాక్టర్ నడపడం వల్లనే ఈ సంఘటన జరిగిందని పోలీసులు తెలిపారు. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనాన్ని ఢీ కొని కూరగాయల దుకాణంలోకి వెళ్లింది. ట్రాక్టర్‌ను నున్న పోలీసు స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

దాసాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టా పూజలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని కృష్ణా మిల్క్ యూనియన్ పాల ఉత్పత్తుల కార్మాగారం 'ప్రాజెక్టు కామధేను' ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన దాసాంజనేయస్వామి దేవస్థానం ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ నెల 16వ తేదిన శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్‌స్వామి పర్యవేక్షణలో దాసాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో చిన్న జీయర్ స్వామి శిష్య బృందం నేతృత్వంలో యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. యూనియన్ ఎండీ కొల్లి ఈశ్వరబాబు, పలువురు పాల సహకార సొసైటీల అధ్యక్షులు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో గ్రామ సభలు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ ఉపసర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి అధ్యక్షతన సోమవారం గ్రామ సభ జరిగింది. ఎస్సీ కాలనీలో డ్రెయినేజీ కాల్వలు, రోడ్లు నిర్మించాలని స్థానికులు కోరారు. డ్రెయినేజీ కాల్వలు శుభ్రం చేయడం లేదని, రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తున్నందున పైపులైన్లు పగిలిపోయి కొన్ని ప్రాంతాలకు గత కొన్ని రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయిందని తెలిపారు. కార్యదర్శి డి.శ్రీనివాసరావు ప్రజల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అలాగే పాతపాడు గ్రామంలో గ్రామ సర్పంచి దేవగిరి సుజాత అధ్యక్షతన గ్రామ సభ జరిగింది. కార్యక్రమంలో కార్యదర్శి పి.కోటిలింగమ్మ, పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు. పి.నైనవరం గ్రామంలో జరిగిన గ్రామ సభలో కోతుల బెడద ఉందని, అసంపూర్తిగా నిలిచిపోయిన గ్రామ పంచాయతీ కార్యాలయం పూర్తి చేయాలని గ్రామస్తులు కోరారు. అంబాపురం గ్రామంలో కూడా గ్రామసభ నిర్వహించారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్

ఘనంగా అంబేడ్కర్ జయంతి వేడుకలు

కంకిపాడు: అణగారిన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని పలువురు వక్తలు కొనియాడారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో గొడవర్రు గ్రామంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో ఎంపీటీసీ సభ్యురాలు చుండూరు నిర్మల జ్యోతి, చుండూరు మోహన్‌రావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. మాలమహానాడు ఆధ్వర్యాన కంకిపాడు లాకురోడ్డులో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి రాజు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అన్ని వర్గాల ప్రజలకు హక్కులను ప్రసాదించిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో నేతలు సిరివెళ్ల చిట్టిబాబు, వర్రె చిట్టిబాబు, పిడుగు వెంకటేశ్వరరావు, సరిహద్దు ఆంటోని, గోవాడ బెర్నాడ్‌షా, రామకృష్ణ పాల్గొన్నారు. అలాగే కూటమి ఆధ్వర్యంలో పట్టణంలోని టీడీపీ కార్యాలయం, ఎన్టీఆర్ విగ్రహం సెంటరు, ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి కార్యాలయం వద్ద జరిగిన అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. సీపీఎం ఆధ్వర్యంలో కంకిపాడు, గొడవర్రు, కోమటిగుంట లాకులు గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు పంచకర్ల రంగారావు, మండల కార్యదర్శి తాడంకి నరేష్, నాయకులు వి.శివశంకర్, సిహెచ్ శ్రీహరి, వి.జాన్‌మోజేస్, హఫీజ్ పాల్గొన్నారు. ఎస్టీయూ ఆధ్వర్యంలో కంకిపాడులో జరిగిన వేడుకల్లో సంఘం జిల్లా అధ్యక్షుడు పీకా ఇమ్మానుయేలు, రాష్ట్ర కౌన్సిలర్ యు.టైటస్‌పాల్, సొసైటీ అధ్యక్షుడు ఐ.నాగేశ్వరరావు, జిల్లా నేతలు జి.జయరాజు, పి.సురేష్‌బాబు, కె.ప్రభాకర్, కె.జాన్సన్, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మధునాగుల మనోహర్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తి ఆదర్శం

పెనమలూరు: అంబేడ్కర్ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం మండల పరిధిలోని కానూరు, కామయ్యతోపులో అంబేడ్కర్ విగ్రహాలకు ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా చక్రవర్తి మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంతోనే నేడు అన్ని వర్గాల వారు తమ హక్కులు సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు. అనంతరం మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ నేతలు, గ్రామస్తులు పాల్గొన్నారు. యనమలకుదురులో వైఎస్సార్ సీపీ నాయకుడు గుమ్మడి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో అంబేడ్కర్ విగ్రహానికి ఆ పార్టీ నేతలు, సీపీఎం నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ పీఠికపై ప్రమాణం చేశారు. నేతలు కర్రా ఆదిశేషారావు, మరీదు శ్రీనివాసరావు, యార్లగడ్డ వీరబాబు, నరేష్, శీలం శ్రీను, జీవ, కలపాల ప్రసాద్, రాజేష్, సీపీఎం నేతలు షేక్ కాశిం, ఉప్పాడ త్రిమూర్తి పాల్గొన్నారు. అలాగే తాడిగడప, కానూరు, గంగూరు, పోరంకి గ్రామాల్లో ఎమ్మెల్యే బోడెప్రసాద్ అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. అనంతరం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకర్‌బాబు, కోయా ఆనంద్‌ప్రసాద్, మారుపూడి ధనకోటేశ్వరరావు పాల్గొన్నారు. కానూరు కామయ్యతోపులో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త ధనేకుల మురళీమోహన్‌రావు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కాగా పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా డీటీసీ డీఎస్పీ జి.శ్రీనివాసరావు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ఎన్ఎస్ఎస్, నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి జరిగింది.

గన్నవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను గన్నవరం నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం నిర్వహించారు. స్థానిక ఆగిరిపల్లి రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్ నేతృత్వంలో వాకర్స్ నివాళులర్పించారు. అనంతరం ఎస్సీ కాలనీలోని అంబేడ్కర్ పార్కులో ఆయన విగ్రహం వద్ద పుష్పాంజలి ఘటించారు. అంబేడ్కర్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక మూడు బొమ్మల సెంటర్‌లో జరిగిన వేడుకల్లో కన్వీనర్ వీఏ విజయకుమార్, కోకన్వీనర్ కర్రా వరప్రసాద్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచేటి మురళీ, సంఘ నేతలు నందం ప్రసాద్, డీ విజయకుమార్ పాల్గొన్నారు. అలాగే కేసరపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి వైస్ ఎంపీపీ సాతులూరి శివనాగరాజకుమారి, సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌనిక నివాళులర్పించారు.

ఎమ్మెల్యే యార్లగడ్డ ఆధ్వర్యంలో..

గన్నవరంలో అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన గరికపాటి శివశంకర్, పలువురు మాల మహానాడు నేతలు బైక్ ర్యాలీగా తరలివచ్చారు. స్థానిక ఎస్సీ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహానికి ఎంఈఎఫ్ నేతలు దేవరపల్లి విక్టర్‌బాబు, ఏసుబాబు పుష్పాంజలి ఘటించారు. ఆర్టీసీ బస్టాండ్‌లో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో డీఎం పి. శివాజీ పాల్గొన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. ఎంపీటీసీ సభ్యుడు తిరివీధి రవి, మాజీ సర్పంచి కోట వినయ్‌కుమార్, ముస్లిం మైనార్టీ నేత చినమస్తాన్ పాల్గొన్నారు.

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలంలోని గ్రామాల్లో సోమవారం అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రసాదంపాడు పంచాయతీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఎంపీటీసీ సభ్యుడు దూరు రత్నం, సర్నాల బాలాజీ, పిన్నిబోయిన రవికుమార్, పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరురూరల్: అంబేడ్కర్ జయంతి వేడుకలు ఉయ్యూరు మండలంలో వాడవాడలా ఘనంగా జరిగాయి. మండలంలోని కలవపాములలో జరిగిన వేడుకల్లో దేవభక్తుని చక్రవర్తి పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. పలు గ్రామాల్లో పేదలకు అన్నదానం నిర్వహించారు. అలాగే స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీడీవో శేషగిరిరావు సిబ్బందితో కలిసి నివాళులర్పించారు. అలాగే బీజేపీ ఆధ్వర్యంలో ఉయ్యూరు మండలంలోని కలవపాముల, దూబా మాలపల్లెలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు డా. చిన్మయ, అసెంబ్లీ కన్వీనర్ విజయేంద్ర, కోకన్వీనర్ రోహిణికుమార్, ఉయ్యూరు మండల అధ్యక్షురాలు పానుగుమాటి జ్యోత్స్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు.

రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళి

గన్నవరం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఆయనకు పలువురు నివాళులర్పించారు. పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.కృపానందం ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పాఠకులు, విద్యార్థులు నివాళులర్పించారు. చిక్కవరం, సూరంపల్లి, ముస్తాబాద తదితర గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు.

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన అంబేడ్కర్ జయంతి జరిగింది. ఉపసర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎంపీపీ యర్కారెడ్డి నాగిరెడ్డి, కార్యదర్శి డి.శ్రీనివాసరావు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అలాగే సీఎస్ఐ కాంపౌండ్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బోడపాడు వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఎంపీటీసీ పెండెం గిరిజాకుమారి, పార్టీ నాయకులు దండు సుబ్రహ్మణ్యం రాజు, పెయ్యల రజనీ, నిరంజన్, ఆంథోని పాల్గొన్నారు. అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో విగ్రహానికి నివాళులర్పించారు. పవర్‌గ్రిడ్‌లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ రాఘవేందర్, జీకేడీ వరప్రసాద్, ఎస్.రమేష్‌బాబు పాల్గొన్నారు.



కానూరులో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి



నున్నలో అంబేడ్కర్ చిత్ర పటం వద్ద నివాళులు



ప్రసాదంపాడులో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు



తాడిగడప జంక్షన్‌లో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

చిరస్మరణీయుడు అంబేడ్కర్



వేలేరులో వైఎస్సార్, అంబేడ్కర్ విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు పాటుపడిన అంబేడ్కర్ చిరస్మరణీయుడని పలువురు వక్తలు కొనియాడారు. బాపులపాడు మండలంలో గ్రామగ్రామాన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను సోమవారం నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద దళిత సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అంబేడ్కర్ చిత్రపటానికి పలువురు ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయం, బాపులపాడులోని అంబేడ్కర్ విగ్రహాల వద్ద కేక్ కట్ చేశారు. వీరవల్లిలోని ఆర్పీహెచ్ కాలనీ, రాజీవ్ పార్కు వద్ద జరిగిన కార్యక్రమంలో హనుమాన్‌జంక్షన్ సీఐ సత్యనారాయణ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. వేలేరులోని రైల్వే గేటు సెంటర్‌లో అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాలకు గ్రామస్తులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

హక్కుల ప్రదాత అంబేడ్కర్

ఉయ్యూరు: హక్కుల ప్రదాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఉయ్యూరులో అంబేడ్కర్ జయంతిని సోమవారం నిర్వహించారు. అంబేడ్కర్ జయంతి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉయ్యూరు సీఐ టీవీ రామారావు, మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, వైస్‌చైర్మన్ సోలే సురేష్ బాబు, వైఎస్సార్ సీపీ ఉయ్యూరు పట్టణ అధ్యక్షుడు షేక్ అబుకలాం, కో ఆప్షన్ సభ్యుడు షేక్ కలీల్, కమిటీ ప్రతినిధులు పినమాల నాగకుమార్, వంపుగడవల జానీ, వేమూరి కృష్ణబాబు, మువ్వల అన్వేష్, ఎంజే రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌లోనూ జయంతి వేడుకలు జరిగాయి.



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైస్‌చైర్మన్ సురేష్‌బాబు, సీఐ రామారావు



పురుషోత్తపట్నంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న విద్యార్థులు



గన్నవరంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పలు సంఘాల నేతలు



ఉయ్యూరులో నివాళులర్పిస్తున్న ఎంపీడీవో శేషగిరిరావు



కంకిపాడు లాకురోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



దావులూరులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఏఈ అశోక్‌కుమార్

చోడవరం గ్రామసభలో వివాదం

పెనమలూరు: చోడవరం గ్రామ పంచాయతీలో సోమవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా గ్రామసభ ఏర్పాటు చేశారు. అయితే పాలక వర్గంలో ఉపసర్పంచితో పాటు పలువురు వార్డు సభ్యులకు గ్రామసభ ఉన్నట్లు నోటీసులు ఇవ్వలేదు. దీంతో సర్పంచి వెంకటరత్నం మాత్రమే గ్రామసభకు వచ్చారు. వైఎస్సార్ సీపీ నేతలు మండూరు కోటేశ్వరరావు, రవికిరణ్, శ్రీనివాసరావు వార్డు సభ్యులను ఎందుకు పిలువలేదని పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నించారు. పాలక వర్గం లేకుండా గ్రామసభ ఎందుకు నిర్వహిస్తున్నారని, అంబేడ్కర్ జయంతి రోజే బీసీ, ఎస్సీ నేతలను అవమానపరిచారని నిరసన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యంపై ఫిర్యాదు చేశారు. కాగా గ్రామంలో బీసీ రామాలయం వద్ద షెడ్డు నిర్మాణం, ఎస్సీ ఏరియాలో బాబూజగ్జీవన్ రామ్ ద్వారం ఏర్పాటు, ఆర్సీఎం చర్చికి ముఖ ద్వారం ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని కోరారు.



చోడవరం గ్రామసభలో ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

రన్ ఫర్ నాలెడ్జ్



కంకిపాడు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించిన అంతర్జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని మండలంలోని మద్దూరులో సోమవారం చిన్నారులు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా రన్ ఫర్ నాలెడ్జ్ కార్యక్రమం చేపట్టారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో సైకిళ్లపై ర్యాలీ నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి చిన్నారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

70 ఏళ్లుగా ఎదురుచూపులు

- శాశ్వత గ్రామ పంచాయతీ భవనానికి నోచుకోని పీ నైనవరం గ్రామం
- సామాజిక రేడియో గదిలోనే పంచాయతీ సమావేశాలు

విజయవాడరూరల్: ఏళ్ల తరబడి గ్రామ పంచాయతీ పరిపాలన రేడియో గదిలోనే కొనసాగుతోంది. ఏకంగా 70 ఏళ్ల నుంచి శాశ్వత గ్రామ పంచాయతీ భవనం కోసం గ్రామస్తులు ఎదురుచూస్తూనే ఉన్నారు. అప్పటి గ్రామ ఫోను రేడియో గదిలోనే గ్రామానికి సంబంధించి పరిపాలన సాగుతోంది. విజయవాడ నగరానికి కేవలం ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఫిర్యాది నైనవరం గ్రామ పంచాయతీ చరిత్ర ఇది. 1952వ సంవత్సరంలో ఫిర్యాది నైనవరం గ్రామ పంచాయతీగా ఏర్పడింది. అప్పట్లో పెంకుటింట్లో గ్రామ పంచాయతీ కార్యాలయం ఉండేది. అయితే 1980వ సంవత్సరంలో సర్పంచిగా ఎన్నికైన సిరిపరపు వెంకటేశ్వరరావు గ్రామప్రజల సౌకర్యార్థం రేడియో ద్వారా వార్తలు వినేందుకు గ్రామ ఫోను రేడియోగదిని నిర్మించారు. ఈ రేడియోగదిలోనే పంచాయతీ సమావేశాలు నిర్వహిస్తున్నారు. అయితే ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే సమావేశాలకు పదిమంది పాలకవర్గ సభ్యులు కూడా వచ్చిన దాఖలాలు లేవు. సమావేశానికి వచ్చినా రేడియో గది చాలేది కాదు. ఇంటికి రికార్డు పంపించి సంతకాలు చేయించుకోవడం జరుగుతుండేది.

రూ. 40లక్షలతో భవన నిర్మాణానికి శ్రీకారం

2019లో అధికారం చేపట్టిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి రెండు వేల మంది జనాభాకు గ్రామ సచివాలయ భవనం నిర్మించారు. అందులో పీ నైనవరం గ్రామంలో కూడా రూ. 40లక్షలతో గ్రామ సచివాలయం భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దీంతో గ్రామ ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. అయితే భవన నిర్మాణం పూర్తయ్యేలోపు ఎన్నికలు రావడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 11 నెలలు గడుస్తున్నా పంచాయతీ భవనం గురించి పట్టించుకోవడం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ఫ్లోరింగ్, కిటికీలు, తలుపులు, టాయిలెట్స్, ఎలక్ట్రికల్ పనులు చేయాల్సి ఉంది. తలుపు ద్వారబంధం లేకపోవడంతో గ్రామంలోని ఆకతాయిలు దీనిని అడ్డగా చేసుకొని అసాంఘిక కార్యక్రమాలు చేస్తున్నారు. సచివాలయ సిబ్బంది అంగన్‌వాడీ కేంద్రం భవనంలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గ్రామ పంచాయతీ భవన నిర్మాణం పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆదాయం ఉన్నా ఆసక్తి లేదు

ఫిర్యాది నైనవరం గ్రామంలో సుమారు ఐదు వేల మంది జనాభా నివసిస్తున్నారు. 1,200 ఎస్సెస్‌మెంట్లు కలిగి సంవత్సరానికి దాదాపు రూ. 12 లక్షలు ఆదాయం వస్తుంది. ఎన్‌ఆర్‌ఈజీఎస్ గ్రాంటు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వివిధ గ్రాంట్ల రూపంలో నిధులు వస్తుంటాయి. అయినా పాలకులు గ్రామ పంచాయితీ భవన నిర్మాణం విషయంలో ఎందుకు ఆసక్తి చూపడం లేదో అర్థం కావడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నిలిచిపోయిన సచివాలయ భవన నిర్మాణం



రేడియో గదిలో ఉన్న పంచాయతీ కార్యాలయం